# పోచారం శ్రీనివాసరెడ్డికి అభినందనల వెల్లువ


పోచారం శ్రీనివాసరెడ్డికి మొక్కను అందజేసి అభినందనలు తెలుపుతున్న రుద్రూర్ ఎంపీపీ, మహిళా సర్పంచులు

చందూర్/రుద్రూర్/వర్ని, డిసెంబర్ 12 : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు పోచారాన్ని బాన్సువాడలోని ఆయన స్వగృహంలో మంగళవారం కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. చందూర్ సొసైటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, మైనారిటీ నాయకులు, లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ, మోస్రా మండలానికి చెందిన యువకులు అభినందనలు తెలిపారు. రుద్రూర్ ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, ఎంపీటీసీలు లక్ష్మీగంగారాం, సావిత్రీ సాయిలు, సర్పంచులు కోర్వ భాగ్యా భూషణ్, రోజా లక్ష్మణ్, గంగమణి ప్రసాద్, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు శానం భాగ్య పోచారానికి మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

**సేవాలాల్ ఆలయంలో పూజలు**

వర్ని మండలం పొట్టిగుట్ట తండా గ్రామంలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో కారోబార్ రూప్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబ్బులు ఎరవేసి ఓట్ల కోసం రాజకీయాలు చేసేవారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి చేసే నాయకులనే ఆదరించాలని కోరారు. ఆయన వెంట వర్ని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, సర్పంచులు లత, పద్మా జగ్‌రాం, బీఆర్ఎస్ నాయకుడు కల్లాలి గిరి తదితరులు పాల్గొన్నారు.


పోచారాన్ని సన్మానిస్తున్న లక్ష్మాపూర్ నాయకులు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోస్రా యువకులు


పొట్టిగుట్ట తండాలో నిర్వహించిన పూజల్లో పోచారం


రుద్రూర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

## కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూపై చర్యలు తీసుకోవాలి

రుద్రూర్, డిసెంబర్12: అక్రమంగా రూ.350 కోట్ల నగదును దాచిన జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్‌సాహూపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

ధర్పల్లి, డిసెంబర్ 12: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో లక్ష్మణ్ మంగళవారం పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. బెల్లియాతండా, గోవింద్‌పల్లి, మరియతండాలో నర్సరీలతోపాటు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు నిర్వహిస్తున్న కూలీలకు పలు సూచనలు చేశారు. జీపీ భవనాలను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు.

## 16న క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 12 : అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని నాగారం రాజారాం స్టేడియంలో ఈ నెల 16న ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 14న సాయంత్రం 6గంటల లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989040776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఫొటో గ్రాఫర్ కుటుంబసభ్యురాలికి చెక్కును అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 12 : గుండెపోటుతో మృతిచెందిన జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సలహాదారుడు ఎండి. సిరాజుద్దీన్ కుటుంబానికి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘంలోని కుటుంబ భరోసా స్కీంలో భాగంగా బాధిత కుటుంబానికి రూ.లక్షా 45వేల చెక్కును అందించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, కార్యదర్శి మోహన్, కోశాధికారి బాస శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, నాసిర్ హుస్సేన్, సురేశ్, మనోజ్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

ఇందల్వాయి, డిసెంబర్ 12 : మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలోని 2005 సర్వే నంబర్‌లో భీముని ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆదివాసీ నాయకపోడ్ సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకట్‌రావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో సుధాకర్, సాయిలు, స్వప్న, సిద్ధరాములు, భూదేవి, గీత, సావిత్రి, గంగారాం, పెద్ద గంగారాం, రాజు, సీహెచ్. గంగారాం, భూమన్న ఉన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


మాట్లాడుతున్న జేడీఏ వాజిద్ హుస్సేన్

డిచ్‌పల్లి, డిసెంబర్ 12 : యాసంగి పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని జేడీఏ వాజిద్ హుస్సేన్ ఆదేశించారు. మండలంలోని నడిపల్లి రైతువేదికలో మంగళవారం ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుత యాసంగికి సిద్ధంగా ఉండాలని, ఎరువులు, విత్తనాలు సరఫరాపై పకడ్బందీ ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా చూడాలని సూచించారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో యాసంగి పంటల నమోదు కార్యక్రమం చేపట్టాలని, వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలపై రైతులకు వివరించాలన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల సమ్మె

ధర్పల్లి/డిచ్‌పల్లి, డిసెంబర్ 12 : సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ధర్పల్లి, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లోని పోస్టాఫీసుల ఎదుట మంగళవారం బైఠాయించి ఆందోళన చేశారు. 11 డిమాండ్ల సాధనకై సమ్మెకు దిగినట్లు వారు తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఇందల్వాయి, డిసెంబర్ 12 : మండలంలోని దేవి తండా గ్రామంలో అనూషకు చెందిన గుడిసె మంగళవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్గమైనట్లు సర్పంచ్ అంబర్‌సింగ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని మండల రెవెన్యూ అధికారి నరేశ్ పరిశీలించి నష్టం వివరాలను సేకరించారని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కోరారు.

## బాన్సువాడలో నేడు బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

రుద్రూర్/కోటగిరి/వర్ని, డిసెంబర్12: బాన్సువాడ మండలంలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో నేడు (బుధవారం) బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పార్టీ మండల నాయకులు తెలిపారు. ఈ మేరకు రుద్రూర్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, కార్యదర్శి బాలరాజు, కోటగిరి మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, వర్ని మండల అధ్యక్షుడు కల్లాలి గిరి మంగళవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని మండలాల కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక


సుజాతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత

డిచ్‌పల్లి, డిసెంబర్ 12 : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని ధర్మారం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సుజాత ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. దీంతో ఆమెను అండర్–19 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు చెప్పారు. ఈ నెల 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుజాతను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ జ్యోత్స్న, టీచర్లు చెన్నకేశ్వరి తదితరులు అభినందించారు.

## బాలికల హక్కులపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటగిరి, డిసెంబర్ 12: బాలికలకు హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత, ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికల హక్కులపై సదస్సు ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పోతంగల్ మండల సూపర్‌వైజర్ సుమలత మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నేరమని, చిన్నతనంలో పెండ్లి చేసుకుంటే కలిగే నష్టాల గురించి వివరించారు. బాలికలకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు వస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలన్నారు. బాలికలకు జీవించే, రక్షణ పొందే, ఆరోగ్య హక్కులు ఉన్నాయని తెలిపారు. బాలికలను ఎవరైనా వేధిస్తే వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల హక్కులను కాపాడాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గోవర్ధన్ సూచించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రమేశ్, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, ఐసీడీఎస్ కో–ఆర్డినేటర్ సాయిలు, పోలీస్ శాఖ సిబ్బంది షౌకత్‌బేగం పాల్గొన్నారు.